క్లుప్తంగా

శ్రీ మఠంలో ఎమ్మిగనూరు డీఎస్పీ పూజలు



దర్శనానికి వెళ్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. అనంతరం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పంచముఖి క్షేత్రంలో వెలసిన శ్రీ పంచముఖి ఆంజనేయ్యస్వామికి పూజలు నిర్వహించారు. ఆయన వెంట మంత్రాలయం సీఐ రామంజులు, ఎస్ఐ పరమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయుడికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహమంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజల్ని చేపట్టారు.

విద్యుత్ చార్జీలను పెంచితే పోరుతప్పదు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచేందుకు యత్నిస్తే పోరాటం చేయక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీలను మోపడం సమంజసం కాదన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలను అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా రూ.17,800ల కోట్లు ప్రజలపై భారం వేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు చిన్నన్న, పంపణ్ణగౌడ్ రంగన్న, నందవరం గిడ్డయ్య, సమీవుల్లా పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ



ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై భవిష్యత్‌లో ఐక్య కార్యాచరణ చేపట్టాలని, అవసరమైతే ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మూగితాత ఫంక్షన్ హాల్‌లో రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరపడం లేదని పత్రికా ప్రకటన చేశారని, అయితే ప్రజల్లో ఇంకా భయాందోళనలు తొలగిపోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భయాందోళనలను ప్రభుత్వం, అధికారులు అర్థం చేసుకొని వారి అనుకూలంగా వ్యవహరించాలని కోరారు. యురేనియం తవ్వకాలతో ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో ఏ తరహా ఉద్యమానికైనా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నరసారావు, సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు మాలిక్‌బాషా, ఆకుల వీరేష్, నెల్లిబండ మల్లికార్జున, మహేంద్రనాయుడు, శ్రీనివాసులు, సర్పంచ్ చిన్నరాములు, సీపీఎం నాయకులు యూసుఫ్‌బాషా, అశోక్, సీపీఐ నాయకులు భాస్కర్, రవి, కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

అపార్ కష్టాలు

- విద్యార్థులకు ఇంటి పేరుతో సమస్యలు
- టీసీ, బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌లో సర్‌నేమ్ దోషాలు
- ఆధార్ సెంటర్లకు పరుగులు



గోనెగండ్లలో పేర్లను సరిచేసుకునేందుకు ఆధార్ దిగుతున్న విద్యార్థినులు

గోనెగండ్ల: కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్–వన్ స్టూడెంట్ ఐడీ పేరిట మినిస్ట్రీ ఫర్ ఎడ్యుకేషన్ అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ రిజిస్ట్రీ) పోర్టల్‌లో విద్యార్థి వివరాలను తెలిపే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రవేశపెట్టింది. ఇందులో రిజిస్టర్ అయిన విద్యార్థులు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా కాన్వొకేషన్ లేకుండా కేవలం 12 అంకెల ఐడీ ఆధారంగా ఉన్నత చదువు అభ్యసించే అవకాశం ఉంటుంది. విద్యార్థి బడిలో చేరినప్పటి నుంచి అన్ని అకడమిక్ వివరాలు వ్యక్తిగత, కుటుంబీకుల చిరునామా, మార్కుల జాబితా, టీసీ తదితరాలు ఇందులోనే అప్‌లోడ్ అయి ఉంటాయి. దీంతో ఏ రాష్ట్రంలోకి వెళ్లి ఏ కళాశాలలో చేరినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యశించుకునే అవకాశం ఉంటుంది. ఇది జరగాలంటే మూడు రకాల రికార్డుల్లో ఒకే సమాచారం ఒకే రకంగా ఉంటేనే సాధ్యం అవుతుంది. విద్యార్థి 1వ తరగతి చేరినప్పుడు అడ్మిషన్ రిజిస్టర్, ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ చేసిన వివరాలు, ఆధార్ కార్డు ఈ మూడింటిలో ఏ చిన్న తప్పు లేకుండా ఒకే రకంగా ఉంటేనే అపార్ నంబర్ సులభంగా జారీ అవుతుంది. లేకుంటే అపార్ నంబర్ జారీ కాదు. ఇలా చాలా మంది విద్యార్థులకు సంబంధించి ఏదో ఒక దాంట్లో ఏదో ఒక తప్పిదం ఉండనే ఉంది. దీంతో వాటిని సరిచేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పనులన్నీ వదులుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం పదో తరగతి సంబంధించి..

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి నామినల్ రోల్స్‌ను పంపాల్సి ఉంది. 1వ తరగతిలో చేరే సమయంలో ఇంటి పేరు (సర్ నేం)తో నమోదు చేసుకుంటారు. సదరు ఉపాధ్యాయులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్‌కార్డుల జారీ సమయంలో ఇంటి పేరు లేకుండా కేవలం ఒక అక్షరం (ఇనిషియల్)తో నమోదు చేశారు. అలాగే పుట్టిన తేదీ ఏదో ఒకటి వేసేశారు. ప్రస్తుతం ఈ రెండే ఆ పిల్లలకు ప్రధాన సమస్యలుగా మారాయి. ఆధార్‌లో మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే చాలా మంది పిల్లల కుటుంబాల్లో ఆ నమోదు జరగలేదు. ఇప్పుడు చేయించడానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో 76 శాతం పూర్తి



మండలంలో ఇప్పటి వరకు 76 శాతం పూర్తయింది. మిగిలిన విద్యార్థులకు పుట్టిన తేదీలు, ఆధార్ కార్డు, పాఠశాల రికార్డుల్లో అక్షర దోషాల సమస్యలు ఉన్నాయి. వీటన్నింటినీ కూడా తర్వలో అపార్ కార్డుకు జనరేట్ అయ్యేలా చేస్తాం. దీనికి అందరూ సహకరించాలి.

–నీలకంఠ, ఎంఈఓ–2, గోనెగండ్ల

కిక్కిరిసిపోతున్న ఆధార్ సెంటర్లు

పది రోజులు క్రితం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందిన ఆదేశాలతో అపార్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే సాంకేతిక లోపాల కారణంగా ఆన్‌లైన్ నమోదు కొంత ఆలస్యమవుతోంది. ఉన్నతాధికారులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. అందరూ ఒకేసారి ఆధార్ కేంద్రాలకు వెళుతుండడంతో కిక్కిరిసిపోతున్నాయి.

మండలంలో 12,880 మంది విద్యార్థులు

గోనెగండ్ల మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 56 ఉన్నాయి. 9 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. జూనియర్ కళాశాల విద్యార్థులతో కలుపుకుని మొత్తం 12,880 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికీ 9,769 మందికి మాత్రమే అపార్ కార్డు జనరేట్ అయ్యాయి. మిగిలిన వారికి పలు సమస్యల వల్ల కార్డులు జనరేట్ కాలేదు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: సెలవు దినాల్లో తరగతులను నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలకు వెళ్లి బైకాట్ చేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సెలవు దినాల్లో కూడా తరగతుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మల్లికార్జున, రసూల్, మల్లి, ఉల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో కరపత్రాలను ప్రజలకు ఇస్తూ ప్రచారం చేసి, ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరులో టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి మంచినీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నెలరోజులుగా నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు పెరిగిపోయాయన్నారు. వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాముడు, కృష్ణ, ఉస్మాన్‌వలి, లక్ష్మన్న, శేఖర్, పరమేష్ పాల్గొన్నారు.

పట్టణ సీఐ బదిలీని రద్దు చేయాలి



సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మూడు నెలల క్రితం బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా పనిచేస్తున్న పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి బదిలీని వెంటనే రద్దు చేయాలంటూ పలు ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. అంతకుమునుపు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. పట్టణంలో నిజాయితీగా విధులు నిర్వర్తించి, అల్లరి మూకలను కట్టడి చేసి శాంతిభద్రతలను కాపాడిన సీఐను బదిలీ చేయడం శోచనీయమన్నారు. వెంటనే ప్రభుత్వం సీఐ బదిలీని నిలిపివేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బతకన్న, కామలే గణేష్, ఆనంద్ చైతన్య, నరసన్న, మహేంద్రబాబు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం పొందడం ప్రాథమిక హక్కు



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ

ఆదోని రూరల్: సత్వర న్యాయం పొందడం పౌరుడి ప్రాథమిక హక్కు అని ఆదోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ అన్నారు. శనివారం మండలంలోని బసాపురం గ్రామంలో రాష్ట్ర, జిల్లా న్యాయసేవా అధికార సంస్థల ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సహాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్కరూ న్యాయానికి దూరంగా ఉండకూడదన్నారు. మహిళలు, పిల్లలు ఎస్సీ, ఎస్టీలు ఎలాంటి ఆదాయ పరిమితిలేకుండా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. రూ.3 లక్షలు లోపు ఆదాయం ఉన్న ప్రతిఒక్కరూ ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నల్లప్ప, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర, న్యాయవాదులు నవీన్ కుమార్‌రెడ్డి, లోకేష్‌కుమార్, శివకుమారస్వామి పాల్గొన్నారు.

రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు

కోసిగి: రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎ.చంద్రశేఖర్, వీఎస్ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ అన్నారు. శనివారం కోసిగిలోని రైల్వే గేటు సమీపంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కోడి ఉరుకుందప్ప ఆధ్వర్యంలో 10వ హెచ్‌ఆర్‌ఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశం అభివృద్ధి అంటే ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడడం, వారికి నివసించడానికి ఇల్లు కట్టించడం, నిత్యావసరరాల సరుకుల ధరలు అందుబాటులో ఉండేలా చూడడం, యువతకు ఉపాధి కల్పించడం. కానీ నేడు స్వార్థ రాజకీయాలతో ధనికులైన పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలు అమలు చేయడమే అభివృద్ధిగా మారిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు తిక్కయ్య, ఉపాధ్యాయులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనం.. కుప్పకూలే ప్రమాదం



చిత్రంలో కనిపిస్తున్న భవనాన్ని చూసి ఏదో పాడుబడినది అనుకుంటే పొరపాటే. ఇది నాగలదిన్నెలోని పశువైద్యశాల భవనం. ఇప్పుడో అప్పుడో కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంది. సిమెంటు పెచ్చులూడి మొత్తం కడ్డీలన్నీ బయటకు తేలి పూర్తిగా శిథిలమైంది. అధికారులు, సిబ్బంది ఇందులోనే భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పదుల సంఖ్యలో రైతులు వైద్యశాలకు వస్తుంటారు. మరమ్మత్తులు చేయించకపోతే పెనుప్రమాదం పొంచి ఉంది. కాగా, మండలంలోని పశువైద్యశాల భవనాలన్నీ దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నాయి.

- పెచ్చులూడి, కడ్డీలు బయటపడిన పశువైద్యశాల భవనాలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- భయంభయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



నాగలదిన్నెలో భవనం పైకప్పుకు సిమెంట్ పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలిన దృశ్యం

నందవరం : మండలంలో పశువైద్య భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్లతరబడి మరమ్మతులకు గానీ, కొత్త భవన నిర్మాణాలకు గానీ నోచుకోవడం లేదు. దీంతో ఉన్న భవనాల్లోనే మూగజీవాలకు వైద్యం చేస్తూ అధికారులు కాలం గడుపుతున్నారు. కనీసం కొత్త భవనాల కోసం స్థలాలు కూడా కేటాయించలేదు. దీంతో చాలీచాలని ఇరుకు గదుల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

అన్ని భవనాల పరిస్థితి ఇంతే..

మండలంలో పశువైద్య భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి. ముఖ్యంగా నాగలదిన్నె, కనకవీడు, ముగతి, ఇబ్రహీంపురం గ్రామాల్లోని వైద్యాశాలలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాగలదిన్నెలో వరద వచ్చిన తర్వాత భవనం పూర్తిగా పాడైంది. భవనం పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలాయి. అలాగే కనకవీడులో పంచాయతీ పాత భవనంలో పశువైద్య కేంద్రం నడుస్తోంది. ఇక్కడ భవన నిర్మాణానికి కనీసం స్థలం కూడా కేటాయించలేదు. ఈ భవనంలో కూడా పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలాయి. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఉన్న దాంట్లోనే మూగజీవాలకు వైద్యం చేస్తున్నారు. అలాగే ఇబ్రహీంపురం, ముగతి గ్రామాల్లోని పశువైద్య భవనాల పరిస్థితి ఇదే మాదిరిగానే ఉంది.

నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది



మండలంలోని పశు వైద్యశాలలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం నాగలదిన్నె, ముగతి భవనాలు పూర్తిగా శిథిలమై ఎపుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం నాగలదిన్నె, ముగతిలో శిథిలమైన భవనాలలోనే కాలం వెళ్లదీస్తున్నాం. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. కనీసం శిథిలైన భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. పాత భవనాలలోనే భయం భయంగా విధులు నిర్వరిస్తున్నాం.

– సరేంద్రనాథ్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్, నందవరం

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

ఆదోని రూరల్/సెంట్రల్: అమరవీరుల ఆశయాల సాధన కోసం ఉద్యమిద్దామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు జి.వెంకప్ప పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆదోని ఏపీటీఎఫ్ ఆఫీసులో అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సభకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అధ్యక్షత వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కస్వామి హాజరయ్యారు. జి.వెంకప్ప మాట్లాడుతూ భూమి, భుక్తి, ఈ దేశ విముక్తే లక్ష్యంగా దోపిడీ, పీడనలేని సమాజం కోసం వేలాదిమంది విప్లవ యోధులు ప్రాణాలను అర్పించారన్నారు. వీరి అమరత్వం, వీరి త్యాగం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, నాగేంద్రప్ప, లింగప్ప, ఐఎఫ్‌టీయూ నాయకులు సొరప్ప, రాయలసీమ మిల్ నాయకుడు కుమార్, పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 14,15 తేదీల్లో విజయవాడలో జరుగనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ మహాసభల కరపత్రాలను సంఘ నాయకులతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. సభలకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని కోరారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి

ఆదోని రూరల్: సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని కల్లుబావి, శంకర్‌నగర్ ఏరియాలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణతో పాటు సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న మాట్లాడుతూ పిల్లల చదువుకు సంబంధించి తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1500, రైతు భరోసా కింద రూ.20 వేలు తదితర పథకాలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగభృతి, నిరుద్యోగులకు అందని ద్రాక్షగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వీరేష్, నాగేంద్ర, నాగరాజు, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో కన్నడ సినీహీరో



ప్రదక్షిణలు చేస్తున్న దాలిధనుంజయ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక కథానాయకుడు దాలిధనుంజయ శనివారం ఉదయం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీ మఠం అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు ఆలయ అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు



లంగారుబావి వీధిలో గుంతల రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో గుంతల రోడ్లకు మరమ్మతు పనులు చేస్తున్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.20 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో సీసీ, గుంతలు పడిన బీటీ రోడ్లకు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల్లో దెబ్బతిన్న, గుంతలు పడిన రోడ్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు.

ప్రత్యేక ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోండి



ఓటర్ నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: నియోజకవర్గంలోని ప్రజలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని–146 ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలోని 133, 134, 135, 136, సాయి కళాశాలలోని పోలింగ్ కేంద్రం 233, 235, 239, 240, 241, ఎస్సీ హాస్టల్‌లోని పోలింగ్ కేంద్రం 251, 252, 253, 254, మదిరె గ్రామంలోని పోలింగ్ కేంద్రం 23, 24, 25, 26, 27 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో 01-01-2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు వచ్చిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఓటర్ తొలగింపు, పేరు, చిరునామా, మార్పులకు అర్జీలు సమర్పించవచ్చునన్నారు.

ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా, తాగునీటి వసతి, వసతిగృహంలో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఓటు హక్కుకు నమోదు చేసుకోండి

నందవరం : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 18 ఏళ్ల నిండిన యువతీయువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. శనివారం మండల కేంద్రం నందవరంతో పాటు హాలహర్వి, ముగతి, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాలలో పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు క్యాంపులను తహసీల్దార్ పరిశీలించారు. అలాగే బూత్ లెవల్ అధికారి(బీఎల్‌ఓ) సలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ప్రత్యేక క్యాంపు రెండు రోజు పాటు 9, 10వ తేదీ వరకు(శని, ఆదివారం) నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం ఓటరు నమోదుకు 60 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మార్పులు చేర్పులను చేసుకోండి

కౌతాళం: ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు చేసుకోవాలని తహసీల్దారు మల్లికార్జునస్వామి అన్నారు. శనివారం కౌతాళంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. శనివారం ఓటరు నమోదుకు 47 దరఖాస్తులు రాగా, పేర్లు మార్పు 8, అడ్రస్ మార్పునకు 5 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కేసులు దారుణం



బెళ్లగుండ ఆంజనేయస్వామి దర్శనార్థం వచ్చిన మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తుండటం దారుణమని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు గ్రామ సమీపంలోనున్న శ్రీ బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు సూపర్‌సిక్స్ అమలు చేస్తామని హామీనిచ్చారని, అయితే నేటి వరకు ఆ పథకాల అమలు గురించి పట్టించుకోకపోవడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పథకాల అమలును ప్రశ్నించకుండా ఉండేందుకే తమ పార్టీ సోషల్ మీడియాపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కానీ.. కాలం ఎల్లప్పుడూ మీవైపే ఉంటుందనుకోవడం పొరపాటన్నారు. కాలం తిరగబడిన రోజు నేడు తప్పులు చేస్తున్నవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇసుక ఫ్రీ అంటూనే కొందరు ఇసుక దందా చేస్తున్నారన్నారు. శ్రీనివాసరెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగేంద్రశెట్టి ,వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల కో–కన్వీనర్ వీరేష్, మల్లికార్జున, నగేష్, తిక్కస్వామి తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం మిల్టన్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. రఘు సెల్ వరల్డ్ సూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 1993–94వ సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులంతా ఒక చోట చేరి ఆనందాలను పంచుకున్నారు. చిన్ననాటి ఆట పాటలను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు రామాంజినేయులు రెడ్డి, టీవీఎస్ మూర్తి, మోహన్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.